ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 07.04.2024 సమయం: 1.10 గంటలు

ముఖ్యాంశాలు

1. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నామంటున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దీనిపై చర్చకు రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్ చేశారు.

2. అసత్యాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్నదాతల ఆత్మహత్యలకు కారణమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ఆరోపించారు.

3. బీఆర్ఎస్ పార్టీ నేత , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

4. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈరోజు , రేపు ఎండ తీవ్రత పెరిగి , వడగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ 'ఆరెంజ్' రంగు హెచ్చరిక జారీ చేసింది.

కాంగ్రెస్-కేటీఆర్

అసెంబ్లీ ఎన్నికల్లో నమ్మి ఓటేసిన 4 కోట్ల తెలంగాణ ప్రజలను నాలుగు నెలలుగా కాంగ్రెస్ నయవంచన చేస్తోందని , అసత్యాలతో అధికారంలోకి వచ్చి అన్నదాతల ఆత్మహత్యలకు కారణమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ఆరోపించారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 6 గ్యారంటీల పేరిట గారడీ చేశారని, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ముందు న్యాయ్ పేరిట నయా నాటకానికి తెరతీశారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో నిన్న కాంగ్రెస్ పార్టీ చేపట్టింది జనజాతర సభ కాదని, అబద్ధాల జాతర సభ అని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్నేతలు అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో సాగునీరు లేక అన్నదాతలు పంట నష్టపోతున్నారని , తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

(పీఎన్)

రాహుల్-కిషన్ రెడ్డి

తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏం చేస్తుందో తెలుసుకునే పరిస్థితిలో రాహుల్ గాంధీ లేరని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని అంటున్న రాహుల్ గాంధీ , దీనిపై చర్చకు రావాలని సవాల్ చేశారు. రైతులకు 2 లక్షల రూపాయాల రుణమాఫీ , నిరుద్యోగులకు 4 వేల రూపాయాల చొప్పున ఇస్తామన్న నిరుద్యోగ భ్రుతి హామీ ఏమైదని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత దేశ ప్రజలు పేదరికంలోకి పోయారంటున్న రాహుల్ గాంధీని చూస్తే జాలేస్తోందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలో రైతులకు ఇచ్చిన రుణమాఫీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

(పీఎన్)

**వెంకట్రావు-కాంగ్రెస్**

లోక్‌సభ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ పార్టీ నేత , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే అయిన వెంకట్రావు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఈరోజు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తెల్లం వెంకట్రావుతో పాటు ఆయన సహచరులూ కాంగ్రెస్‌లో చేరారు. వెంకట్రావు కాంగ్రెస్ లో చేరడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి శాసన సభలో బీఆర్ఎస్ కు ప్రాతినిధ్యం లేకుండా పోయింది.

(డెస్క్)

**కంటోన్మెంట్ –కాంగ్రెస్ అభ్యర్థి**

కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా నారాయణన్ శ్రీగణేశ్‌ను ఆ పార్టీ ప్రకటించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణంతో కంటోన్మెంట్ స్థానం ఖాళీ అయింది. లోక్‌సభ ఎన్నికలతోపాటే కంటోన్మెంట్ ఉప ఎన్నికకు కూడా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. గత డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున శ్రీ గణేశ్ పోటీ చేశారు. 41 వేల 888 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు.

(డెస్క్)

**నేతన్నలు-బండి సంజయ్**

వస్త్ర పరిశ్రమలు మూతబడి నెలలు గడుస్తున్నా , తినడానికి తిండిలేక నేతన్నలు తనువు చాలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి , కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ భౌతిక దేహానికి నిన్న రాత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ఆర్థిక పరిస్థితిని

తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు లక్ష రూపాయాల ఆర్థిక సాయాన్ని అందించారు. లక్ష్మీనారాయణ కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

(పీటీసీ, సిరిసిల్ల)

**మావోయిస్టుల లేఖ**

తమ దళంలోని ఒక వెన్నుపోటు దారుడు ఇచ్చిన సమాచారం మేరకే ఈ ఎన్ కౌంటర్ జరిగిందని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ములుగు జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్ కౌంటర్ పై కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే-ఏఎస్ఆర్)పేర మావోయిస్టులు ఈ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. బూటకపు ఎన్ కౌంటర్లకు కాంగ్రేసే బాధ్యత వహించాలని ఆరోపించారు.

## WORLD HEALTH DAY

ఈరోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఆరోగ్య సేవలు అందుకోలని ప్రపంచ జనాభాలో సగం మందికి పైగా ఉన్న 4.5 బిలియన్ ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందుబాటులోకి తీసుకరావడానికి నా ఆరోగ్యం నా హక్కు అనే ఇతి వృత్తంతో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

పొగాకు కు దూరంగా

ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే , ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమౌతుందని తద్వారా ఆరోగ్య భారతం తధ్యం అని పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత , సామాజిక కార్యకర్త మాచన రఘునందన్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ పొగాకు, ధూమపానం అలవాట్ల వల్ల,ఆ అలవాట్లు ఉన్న వారితో సాంగత్యం వల్ల కూడా ఆరోగ్యం దెబ్బ తినే అవకాశం లేకపోలేదని రఘునందన్ సూచించారు.

PN

వాతావరణం

రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. రాష్ట్ర మంతటా సగటున 41 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉమ్మడి నల్గొండ , ఖమ్మం జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం తుంగెడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ వాడకు చెందిన దూడ కిష్టయ్య నిన్న వడదెబ్బతో మృతిచెందారు. కాగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ రోజు రేపు వడగాలులు వీచే ప్రమాదం ఉందని అప్రమత్తం చేసింది. రాష్ట్రమంతటా 40-45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని 'ఆరెంజ్' రంగు హెచ్చరికలను విడుదల చేసింది. అలాగే, కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులు ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది.

(డెస్క్)

నల్లగొండ-ఎండలు

నల్లగొండ జిల్లాలో ఎండల తీవ్ర పెరిగింది. నాంపల్లి మండలంలో నిన్న అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈరోజు నుంచి జిల్లా వ్యాప్తంగా వడగాల్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. గత పక్షం రోజులుగా జిల్లాలో సాధారణం కన్నా నాలుగైదు డిగ్రీల అదనపు ఉషోగ్రతలు నమోదవుతుండటం తో ప్రజలు బయటకు రావడానికే జంకుతున్నారు.

(పీటీసీ, నల్లగొండ)

ఖమ్మం-ఎండలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన జిల్లాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒకటి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని గరి మెళ్లపాడులో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత , మల్కారం, అశ్వాపురం

ప్రాంతాల్లో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దాంతో వాతావరణ శాఖ జిల్లాలో ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.
(PTC, khammam)

**వనపర్తి-ఎండ**

ఎండ తీవ్రత, వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు ఉదయం 12 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు అత్యవసరమైతే తప్పా బయటకువెళ్ళొద్దని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. శరీర వేడిమినీ అదుపులో చేసే పానియాలు సేవించాలన్నారు. నిన్న ఉదయం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో 44.3 డిగ్రీలగరిష్ట ఉష్ణోగ్రత నమోదు అయినట్లు ప్రణాళిక శాఖ సహా-సంచాలకులు మక్సూద్ మియా పేర్కొన్నారు.

(వనపర్తి, పిటిసి)

**మెట్రో-కార్డు రద్దు**

సెలవు రోజుల్లో 59 రూపాయాలు చెల్లించి రోజంతా మెట్రో రైళ్లలో అపరిమితంగా ప్రయాణం హాలిడే కార్డును హైదరాబాద్ మెట్రో రద్దు చేసింది. మార్చి 31తో ఈ ఆఫర్ ముగిసిందని అధికారులు తెలిపారు. ఆదివారం, రెండో శనివారంతో పాటు ఇతర సెలవు రోజుల్లో ఈ కార్డు అందుబాటులో ఉండేది.
(డెస్క్)

సిరిసిల్ల-వార్షిక పరీక్షలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు నిర్వ హించాల్సిన వార్షిక పరీక్షల తేదీల్లో మార్పులు చేసి నట్లు జిల్లా పరీక్షల నియంత్రణ సహాయ అధికారి వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం నుంచి నిర్వ హించాల్సిన పరీక్షలను ఈనెల 15 నుంచి ప్రారంభించేందకు రాష్ట్ర పరీక్షల బోర్డు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈనెల 22వరకు

నిర్వహిస్తారని, విద్యార్థులు తల్లిదండ్రులు , పాఠశాలల యాజమాన్యాలు గమనించాలని సూచించారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల )

గ్రేటర్ వరంగల్-కమిషనర్

పర్యావరణ వ్యర్థాల ద్వారా రూపొందించే ల్యాండ్ ఫిల్ గ్యాస్ ( LFG) విద్యుత్ ఉత్పత్తికి సహకారం అందిస్తామని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నిన్న రాత్రి బల్దియా ప్రధాన కార్యాలయంలో దక్షిణ కొరియాకు చెందిన సేజింగ్ కంపెనీ ప్రతినిధులతో కమిషనర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వ్యర్థాలతో ల్యాండ్‌ఫిల్ గ్యాస్ విద్యుత్ ఉత్పత్తి గురించి వివరించారు.

(వరంగల్ జిల్లా పీటీసీ)

**సిరిసిల్ల-వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు వేకువవ జాము నుంచే క్యూలైన్లలో భక్తులు భారులు తీరారు.

**(పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా)**

**నిర్మల్-కలెక్టర్**

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) సరఫరాను వేగవంతం చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. నిన్న సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సిఎంఆర్ సరఫరా , లక్ష్యలు తదితర అంశాల పై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. 2023-24 సంవత్సరం సీఎంఆర్

లక్ష్యాలను వేగవంతంగా చేయాలని సంబంధిత మిల్లర్లను ఆదేశించారు. నిరంతరం మిల్లింగ్ చేయాలని, ఈ నెల 10 లోపు పూర్తీ చేయాలనీ సూచించారు. నిబంధనలు పాటించని మిల్లర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

(పిటిసి నిర్మల్ జిల్లా )

**కామారెడ్డి-వ్యవసాయం**

కోతకు వచ్చిన వరిపంటను పాము పొడ తెగులు విపరీతంగా అశి స్తుందని , పంట పొలాలను రైతులు జాగ్రత్తగా పరిశీలించాలని కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్ సూచించారు. ఇందుకోసం ప్రాపి కొనజోల్ 200 ఎం.ఎం.. మందును లేదా హెక్సాకొనజోల్ 400 ఎం.ఎం మందును ఎకరం పంట పొలానికి పిచికారి చేయాలన్నారు. అగ్గితెగులు నివారణకు గాను ట్రై సైక్లోజో న్ , మాంకిజోల్ 300 గ్రాముల మందు ను ఎకరానికి పిచికారి చేయాలని ఆయన తెలి పారు.

**(పీటీసీ, సిరిసిల్ల)**